# పారిశుద్ధ్యం మీద దక్షిణ ఆసియా దేశాల నాల్గవ సమావేశం (సాకోశాన్-4)

**"పారిశుద్ధ్యం జీవన ప్రమాణాల స్థాయిని పెంచుతుంది"**

4 - 7 ఏప్రిల్ 2011, కొలంబో, శ్రీలంక

## కొలంబో ప్రకటన

మేము, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక దేశాల ప్రభుత్వ ప్రతినిధి బృందాలవారం శ్రీలంకలో 2011 ఏప్రిల్ 4-7 దాకా పారిశుద్ధ్యం మీద జరిగిన దక్షిణ ఆసియా దేశాల సదస్సులో పాల్గొంటున్నాము. ఈ సమావేశంలో మంత్రులు, ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, కమ్యూనిటీ సభ్యులు, పారిశుద్ధ్య అంశం మీద పనిచేస్తున్న సంస్థల నిపుణులు, విద్యావేత్తలు, పౌరసమాజం, ప్రభుత్వేతర సంస్థలు, అభివృద్ధి భాగస్వాములు, ప్రయివేటు రంగం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

1) మేము దృష్టిలోకి తీసుకున్న ముఖ్యమైన అంశాలు: దక్షిణ ఆసియా దేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితి సంక్షోభంలో ఉన్నది. బహిరంగ మలవిసర్జన చేసేవారు, సరైన పారిశుద్ధ్య సౌకర్యాలు లేనివారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. కిందటిసారి సాకోశాన్ సమావేశం జరిగిననాటి నుండి ఈ రోజుకి దక్షిణ ఆసియా ప్రాంతంలో 7,50,000 మంది పిల్లలు నీళ్ల విరేచనాల కారణంగా చనిపోయారు. డయేరియా చావులకూ సరైన పారిశుద్ధ్య సౌకర్యాలు లేకపోవడానికీ మధ్య చాలా దగ్గరి సంబంధం ఉంది.

2) కమ్యూనిటీలను సాధికారత దిశగా నడిపించడానికి పారిశుద్ధ్యానికి ఉన్న శక్తినీ, పారిశుద్ధ్యం అభివృద్ధికి బలమైన తొలిమెట్టనీ గుర్తించాము.

3) పారిశుద్ధ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, సుస్థిర పారిశుద్ధ్యం కోసం జరుగుతున్న అంతర్జాతీయ అయిదేళ్ల కార్యక్రమానికి సహకారాన్ని అందించడానికి అవసరమైన రాజకీయ నిబద్ధతను కొనసాగించడంలో సాకోశాన్ పాత్రనూ, దాని ఆవశ్యకతనూ స్పష్టంగా గుర్తిస్తున్నాం. ఢాకా (అక్టోబర్ 2003), ఇస్లామాబాద్ ( సెప్టెంబర్ 2006), కొత్త ఢిల్లీ (నవంబర్ 2008)లలో జరిగిన సాకోశాన్ సమావేశాల్లో ప్రకటించిన మంచి పారిశుద్ధ్యము, పరిశుభ్రత సూత్రాలకు కట్టుబడి ఉంటామని మా సంసిద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం.

4) సుస్థిర పారిశుద్ధ్యం, పరిశుభ్రత అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన ప్రభుత్వ విధానాలూ, కార్యక్రమాల కోసం దక్షిణ ఆసియా ప్రజల కోసం అవసరమైన పెట్టుబడులు పెట్టాలన్న మా ఉమ్మడి వాగ్దానానికి కట్టుబడి ఉంటామని మరొకసారి పునరుద్ఘాటిస్తున్నాం.

*మేము పై వాగ్దానాలకు అంకిత భావంతో కట్టుబడి ఉంటామని పునరుద్ఘాటిస్తూ ఈ క్రింది విషయాలను ఏకగ్రీవంగా అంగీకరిస్తూ వాటికి నిబద్ధులమై ఉంటాము :*

(1) ఐక్యరాజ్య సమితి పారిశుద్ధ్యాన్ని హక్కుగా గుర్తించిన నేపథ్యంలో, ఈ హక్కు కార్యక్రమాల్లోనూ, ప్రాజెక్టులోనూ అంతర్భాగం అయ్యేందుకు, కాలక్రమంలో చట్టంగా మారే ప్రగతి దిశలో పనిచేయడం.

(2) ఇంతకు ముందరి సాకోశాన్ సమావేశాల వాగ్దానాలు అమలు జరిగేందుకు నిర్ణీత సమయంతో కూడిన ప్రణాళికల్ని అభివృద్ధి చేయడం, వాటికి అవసరమైన నిధులను కేటాయించడం, సమకూర్చడం.

(3) ప్రజల స్థానిక పరిస్థితులకనుగుణంగా, సమన్యాయంతో అందరికీ సుస్థిర పారిశుద్ధ్య, పరిశుభ్రతా కార్యక్రమాలను రూపొందించాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదలు, అభివృద్ధికి నోచుకోక వెనుకబడ్డ వర్గాల వారినీ గుర్తించడానికి మెరుగైన పద్ధతుల్ని ఉపయోగించాలి. పారిశుద్ధ్య కార్యక్రమాలు అత్యవసరమున్న ప్రజలను గుర్తించి వారికి అవసరమైన కార్యక్రమాల్ని ప్రణాళికాబద్ధంగా తగిన నిధులతో అమలు చేయడంలో పారదర్శకత ఉండాలి. పర్యావరణ పరిరక్షణ, అత్యవసర పరిస్థితులకు స్పందించడం, పర్యావరణ మార్పు సవాళ్లను పరిగణనలోకి తీసుకోవాలి.

(4) అన్ని పాఠశాలల్లోనూ (ప్రస్తుతం ఉన్నవి, కొత్తగా నిర్మించబడుతున్నవి), అన్ని స్థాయిల్లోనూ, పిల్లలకు అనుకూలమైన, బాలబాలికలకు వేరువేరుగా, బహిష్టు పరిశుభ్రతా నిర్వహణకు అనుకూలమైన మరుగుదొడ్లను ఏర్పరచడం ద్వారా పాఠశాలల్లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ఆరోగ్య సౌకర్యాల స్థాయిని పెంచాలి.

(5) పారిశుద్ధ్యం, పరిశుభ్రత కార్యక్రమాల్ని సమన్వయ పరచడానికి ఒక జాతీయ సంస్థను ఏర్పరచాలి. ఇందులో పారిశుద్ధ్య అభివృద్ధికి సంబంధించిన అన్ని సంస్థలు/శాఖల ప్రతినిధులు (ఆర్థిక, ఆరోగ్య, ప్రజారోగ్యం, పర్యావరణం, నీరు, విద్య, స్థానిక సంస్థలు, మహిళాభివృద్ధి మొదలగు అంశాలకు సంబంధించిన స్థానిక, రాష్ట్ర, జాతీయ ప్రభుత్వ) కలిసి వుండాలి.

(6) పారిశుద్ధ్యం, పరిశుభ్రతా కార్యక్రమాలకు ప్రత్యేకమైన ప్రభుత్వ (పబ్లిక్ సెక్టర్) నిధుల కేటాయింపు ఉండాలి.

(7) పారిశుద్ధ్యానికి కాలక్రమేణా నిధుల కేటాయింపు పెరగాలి.

(8) పారిశుద్ధ్యానికి ప్రజలు సొంతంగా పాటుపడటానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించాలి. ప్రజలు తమ పారిశుద్ధ్య సమస్యలకు పరిష్కారాలను తామే అమలు చేసుకోగల్గిన స్థితికి, ప్రజల నియంత్రణే ఉండే విధంగా వారి సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వ విధానాలూ, కార్యక్రమాలూ ఉండేటట్లు చూసుకోవాలి. అదే సమయంలో పేదవారి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలి.

(9) బాధ్యతలు, పాత్రలు స్పష్టంగా నిర్వచిస్తూ, సమగ్రమైన మానిటరింగ్ విధానాలను అభివృద్ధి చేయాలి. అందరికీ అంగీకరమైన సూచికలు, వాటి ఆధారంగా ఆశించిన (ప్రక్రియ, ప్రభావాలకు సంబంధించిన) ఫలితాలను ఎంతమటుకు, వివిధ స్థాయిల్లో ఏ విధంగా సాధించామో తెలియజేసే నివేదికలు, సమాచారం అందించే విధంగా ఉండాలి. ఈ ఫలితాలు ఇంటి స్థాయిలోనూ, కమ్యూనిటీ స్థాయిలోనూ కూడా మానిటర్ చేయాలి. వెనుకబడిన, నిర్లక్ష్యానికి గురైన, బలహీన (మార్జినలైజ్డు, వల్నరబుల్ గ్రూపులు) వర్గాల ప్రజల అభివృద్ధి గురించి సాధించిన ఫలితాలు ప్రత్యేకంగా పరిశీలన పర్యవేక్షణ జరగాలి.

(10) పాఠశాలల్లో వాష్ కార్యక్రమం, అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశాలైన చేతులు కడుక్కోవడం, బహిష్టు పరిశుభ్రతలాంటి ముఖ్యమైన కార్యక్రమాలకు ప్రత్యేకమైన సూచికల్ని మానిటరింగ్ పద్ధతుల్లో పొందుపరచాలి.

(11) పారిశుద్ధ్య, పరిశుభ్రత కార్యక్రమాలను రూపొందించేటప్పుడు, అమలు చేసేటప్పుడు, కమ్యూనిటీ స్థాయిలో, ముఖ్యంగా మార్జినలైజ్డ్ ప్రాంతాలకూ, వల్నరబుల్ గ్రూపులకూ భాగస్వామ్యం ఉండే విధంగా, అన్ని సామాజిక వర్గాలకూ అందుబాటులో ఉండే విధంగా, సామాజిక జవాబుదారీతనం ఉండే విధంగా రూపొందించాలి.

(12) పారిశుద్ధ్యం, పరిశుభ్రత కార్యక్రమాల అమలుకు కావాల్సిన శక్తి సామర్థ్యాలను పెంపొందించాలి. ఉన్నత విద్యావకాశాలు, పాఠ్యప్రణాళికా అభివృద్ధి, పరిశోధన మరియు అభివృద్ధి, జ్ఞానాన్ని పంచుకోవడమూ, భాగస్వామ్యం పెంపొందించుకోవడానికి అవసరమైన పెట్టుబడులు పెట్టటం కూడా శక్తి సామర్థ్యాల పెంపుదలలో భాగమే.

(13) సాకోశాన్ సమావేశాలు ప్రభావవంతంగా ఉంచేందుకు, నేపాల్‌లో రెండు సంవత్సరాల తర్వాత జరుగబోయే సాకోశాన్ సమావేశంలో, ఈ సమావేశంలో అంగీకరించిన అంశాల అమలు/ప్రగతి మీద, ఇంతకుముందు

సాకోశాన్ సమావేశాల్లో అంగీకరించిన అంశాల మీద సాధించిన ఫలితాలనూ నిబద్ధతతో తెలియజేయాలి. భవిష్యత్తులో జరిగే అన్ని సమావేశాల్లోనూ ఆర్థిక, విద్య, ఆరోగ్య తదితర సంబంధిత మంత్రిత్వ శాఖల ప్రతినిధులు కూడా పాల్గొనేటట్టు చూడాలి.

(14) ఢిల్లీ సాకోశాన్-3 సమావేశంలో రూపొందించిన "రోడ్ మ్యాప్" ఆచరణ, పర్యవేక్షణను బలోపేతం చేయాలి. సాకోశాన్-1లో రూపొందించిన అన్ని దేశాల సభ్యులు గల వర్కింగ్ గ్రూపు ప్రతి సంవత్సరమూ సమావేశమవటమూ, ప్రతి దేశమూ తన సొంత నివేదికల్ని రూపొందించటమూ ద్వారా దీన్ని సాధ్యం చేయాలి.

*ఈ కింది విషయాల మీద కూడా దృష్టి పెట్టాలని మేము భావిస్తున్నాం:*

ఆభివృద్ధి బ్యాంకులు, విదేశీ సహాయ సంస్థలు, ప్రైవేటు రంగం కూడా మా ప్రయత్నాలకు సహకారాన్ని అందించాలి. పారిశుద్ధ్యం, పరిశుభ్రత రంగాలకు ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని అందించాలి. దక్షిణ ఆసియాలో పరిశుభ్రత, పారిశుద్ధ్య రంగాలకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల సమన్వయాన్ని మెరుగుపర్చాలి.

సార్క్(యస్.ఏ.ఏ.ఆర్.సీ) పారిశుద్ధ్యం, పరిశుభ్రతలను తన కార్యక్రమాల్లో భాగం చేసుకోవాలి. సాకోశాన్‌తో సంబంధాన్ని పెంపొందించుకోవాలి.

ఐక్యరాజ్యసమితి 2015 తర్వాత అభివృద్ధికి చెందిన టార్గెట్లను తయారు చేస్తున్నప్పుడు దక్షిణాసియాలో నెలకొని ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ జాయింట్ మానిటరింగ్ కార్యక్రమంలో కూడా కమ్యూనిటీ స్థాయిలో ఫలితాలను మానిటర్ చేయాలి. దక్షిణ ఆసియాలో పెద్ద సంఖ్యలో ఉన్న కమ్యూనిటీ మరుగుదొడ్లనూ, ఎక్కువ మంది వాడే మరుగుదొడ్లనూ కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

శ్రీలంక ప్రభుత్వం, ప్రజలు కూడా ఈ సమావేశాన్ని నిర్వహించడంలో ప్రదర్శించిన సామర్థ్యానికి, ఆతిథ్యానికీ మా హార్దిక అభినందనలు. శుభాకాంక్షలు.

కొలంబో, శ్రీలంక, 6 ఏప్రిల్, 2011